మహిమాన్వితుడు బెహెలూల్ షా బాబా

- నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు
- విజయవంతం చేయాలని దర్గా పీఠాధిపతి షేక్‌షా వలి పిలుపు



బెహెలూల్ షా ఖాద్రీ బాబా సమాధి



బాబా దర్గా ముఖద్వారం

పెనుకొండ: పెనుకొండ సమీపంలోని జాతీయ రహదారి పక్కన వెలసిన హజరత్ సయ్యద్ బెహెలూల్ షా ఖాద్రీ షహీద్ బాబా దర్గా సర్వమత సమైక్యతకు ప్రతీకగా విరాజిల్లుతోంది. ఆపదలో ఆదుకొనే మహిమాన్విత బాబాగా భక్తులు కొలుస్తుంటారు. కుల, మతాలకు అతీతంగా భక్తులు దర్గాకు బాబా సమాధిని దర్శించుకుంటారు.

ఇరాన్ నుంచి పెనుకొండకు...

బెహెలూల్ షా బాబా ఇరాన్ దేశంలోని సీస్తాన్ పట్టణానికి చెందిన వారు. చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మిక మార్గంలో ఉంటూ గురువు ఆజ్ఞానుసారం భారతదేశానికి వచ్చి మతసామరస్యానికి కృషి చేసినట్లు చరిత్ర చెబుతోంది. 1197లో బాబా పెనుకొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో సమాధి అయ్యారు. అప్పట్లో దట్టమైన అరణ్యం కావడంతో బెంగళూరు, హైదరాబాద్ వైపు రాకపోకలు జరిపే వారు క్రూర మృగాలు, దొంగల భయంతో వణికిపోయే వారు. ఎద్దుల బండ్లు, గుర్రాలపై వెళ్లే వర్తకులు బాబా సమాధి వద్ద ప్రార్థనలు చేసి వెళ్లేవారు. ప్రమాదాల బారి నుంచి కాపాడి వ్యాపారాల్లో లాభాలు గడిస్తే మొక్కుబడి చెల్లించుకుంటామని ప్రార్థించే వారు. అలా వారు అనుకున్నట్లే అవుతుండటంతో బెల్లంతో చదివింపులు చేసే వారు. దీంతో బెహెలూల్ షా బాబాను హిందువులు బెల్లాల్ సాబ్, జలాల్ సాబ్ అంటూ పిలిచేవారు. శతాబ్దాలుగా ఈ దారి వెంట వెళ్లే వారిని బెహెలూల్ షా బాబా రక్షిస్తున్నారని భక్తుల నమ్మకం. భక్తులను అనేక దఫాలు రోడ్డు ప్రమాదాల నుంచి బాబా గట్టెక్కించినట్లు చెబుతారు.

ఆ నీరు సేవిస్తే ఆపదలు దూరం

దర్గా వెనుక భాగంలో 800 సంవత్సరాల క్రితం బెహెలూల్ షా బాబా వజూ చేసిన చష్మ ఇప్పటికి ఉంది. అందులో నీరు ఎప్పటికీ ఎండిపోవు. సర్వ రోగాలకు ఆ నీరు ఎంతో ఉపయోగం అని భక్తుల నమ్మకం. దారి వెంబడి వెళ్లే లారీ, ఇతర వాహనదారులు ఆ నీటిని సుదూర ప్రాంతాలకు తీసుకెళ్తుంటారు. బ్రిటీష్ కాలంలో కూడా ఆ చెలిమి నీరు సేవించి ఆంగ్లేయులు జలాల్‌సాబ్ కుంటగా నామకరణం చేశారని అంటున్నారు. ప్రస్తుతం బావిగా మారిన ఆ చెలిమిని షఫా కుంటగా పిలుస్తారు.

ప్రతి ఏడాది సర్పం...

బాబా దర్గా వెనుక భాగంలో దశాబ్దాల కాలంగా ఓ పాముల పుట్ట ఉంది. అందులో ఉన్న ఓ సర్పం ప్రతి గంధం వేడుక సమయంలో స్వామి వారి సమాధిని దర్శించుకుంటుందని దర్గా నిర్వాహకులు తెలిపారు. దీంతో పుట్టలో హిందూ, ముస్లింలు పాలు పోయడంతో పాటు పూజలు చేస్తుంటారు.

13న గంధం

ఈ నెల 12న నషాన్, 13న గంధం పూజ, 14న దీపారాధన, ఉత్సవాలు జరుగుతాయని పీఠాధిపతి ఆదోని షేక్ షా వలి తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి ఉరుసు ఉత్సవంలో పాల్గొనాలని కోరారు. అన్నదాన కార్యక్రమం, ప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు.

జన సంక్షేమమే జగనన్న ధ్యేయం

- హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త దీపిక

హిందూపురం: జన సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ పార్వతీతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కార్యదర్శులతో కలిసి సోమవారం లక్ష్మీపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ వేయించాలని పులమతిరోడ్డు, కలిపి, ఎన్‌జీవో లేవుట్ ప్రాంతాల్లో స్థానికులు కోరారు.

ఇతర రాష్ట్రాలకూ ఆదర్శం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. జగనన్న ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేస్తోందన్నారు. అధికారం చేపట్టిన నాలుగేళ్లలోనే 98 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం జగనన్న అన్నారు. సంక్షేమ పథకాలతో టీడీపీ నాయకుల కుటుంబాలకు సైతం లబ్ధి చేకూరిందన్నారు. గత పాలకులు జేబులు నింపుకోవడమే లక్ష్యంగా పనిచేశారని, అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. ప్రతి వార్డులో ప్రతి ఇంటికి వెళ్తున్నాం.. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో వచ్చి డైలాగులు చెప్పి అరచేతిలో వైకుంఠం చూపించే నాయకులం కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్‌వుల్లా, నాగేంద్రబాబు, షాజియా, చంద్ర, గిరి, మల్లికార్జున, పార్టీ మండల అధ్యక్షులు శ్రీరాంరెడ్డి, నాగమణి, వార్డు నాయకులు కృష్ణగౌడ్, శివరామిరెడ్డి, జేమ్స్, చందు, బోజురాజు, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముబారక్ అనే వ్యక్తి గాయపడ్డాడు. ఆదివారం రాత్రి ముబారక్ ద్విచక్ర వాహనంలో వస్తుండగా ట్రాక్టర్ ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీల అభివృద్ధికి చర్యలు తీసుకోండి



మహిళా, శిశు, వికలాంగులు, వృద్ధుల లెజిస్లేచర్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సోమవారం అమరావతిలో జరిగిన మహిళా, శిశు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమ లెజిస్లేచర్ కమిటీ సమావేశంలో కోరినట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. నియోజకవర్గంలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, సొంత భవనాలను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ప్రహరీ, మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. మడకశిర కేంద్రంగా వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కమిటీ చైర్‌పర్సన్, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

అమరాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఈరన్న, హెచ్‌ఎం. మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కె.శివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ ఈరన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, కబడ్డా, ఖోఖో, వాలీబాల్, తదితర పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరచిన 50 మందిని నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేశామని పీడీ.సిద్దేశ్వర తెలిపారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలుర మండలస్థాయి ఎంపికకు పోటీలను హెచ్‌ఎం కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. బాలుర విభాగంలో వాలీబాల్, త్రోబాల్, యోగా, ఖోఖో, కబడ్డీ, షటిల్, అథ్లెటిక్స్ తదితర పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీఈటీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు.

ఆధ్యాత్మిక శోభ



మడకశిర: అలంకరణలో భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి



రొళ్ల: కె గొల్లహట్టిలో జ్యోతులు మోస్తున్న మహిళలు



అమరాపురం: నిడగల్లు దోనెలో గంగా పూజ చేస్తున్న భక్తులు



అమరాపురం: గౌడనకుంట వీరభద్రస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం

సాక్షిబృందం: శ్రావణమాసంలో చివరి సోమవారం కావడంతో మడకశిర నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగానే జ్యోతులను సమర్పించారు. కొన్ని ప్రాంతాల్లో గంగపూజ, సంప్రోక్షణ పూజలు జరిగాయి.

కనిపించని బంద్ ప్రభావం

- యథావిధిగా వ్యాపార లావాదేవీలు
- అన్నిచోట్లా తిరిగిన ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు
- బంద్‌కు ప్రజల మద్దతులేకపోవడంతో టీడీపీ నేతల్లో నిరాశ



హిందూపురం: ప్రైవేటు బస్సులు నడుస్తున్న దృశ్యం

మడకశిర: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా సోమవారం రాష్ట్ర వ్యాప్త బంద్‌కు ఆ పార్టీ పిలుపు నిచ్చింది. అయితే ఈ బంద్ ప్రభావం మడకశిరలో కనిపించలేదు. మడకశిర పట్టణంలో వ్యాపార సంస్థలన్నీ తెరిచే ఉంచాయి. విద్యాసంస్థలన్నీ పని చేశాయి. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులన్నీ తిరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు కూడా పని చేశాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ బంద్‌ను పట్టించుకోలేదు. మడకశిర పట్టణంలోనే కాకుండా నియోజకవర్గంలోని అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురంలో కూడా బంద్ ప్రభావం కనిపించలేదు. బంద్‌కు ప్రజల నుంచి మద్దతు లభించకపోవడంతో స్థానిక టీడీపీ నాయకులు నిరాశకు గురయ్యారు. మరోవైపు బంద్ సందర్భంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా స్థానిక పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆయా మండలాల ఎస్‌ఐలు లోకేశ్, మునిప్రతాప్, లావణ్య, మధు, వెంకటేశ్వర్లు తదితరులు పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

పురంలో బంద్ నిల్

హిందూపురం: హిందూపురం నియోజకవర్గం లేపాక్షి, చిలమత్తూరు ప్రాంతాలతో పాటు హిందూపురంలోనూ టీడీపీ రాష్ట్రబంద్ ప్రభావం కనిపించలేదు. ఉదయం నుంచి అన్ని వ్యాపారాలు యథావిధిగా కొనసాగాయి. పాఠశాలలు ముందస్తుగా సెలవు ప్రకటించారు. అయితే ఉదయాన్నే నల్లజెండాలను పట్టుకుని టీడీపీ నాయకులు పలు ప్రాంతాల్లో తిరుగుతూ సామాన్యులు దుకాణాలు మూయించారు. కొద్దిసేపటికే పోలీసులు వారి ప్రయత్నాలను భగ్నం చేసి ఎక్కడిక్కడ అరెస్టు చేసి వాహనాల్లో పోలీసుస్టేషన్లకు తరలించారు. దీంతో వ్యాపార లావాదేవీలతో పాటు బస్సులు, వాహనాల రాకపోకలు కొనసాగాయి. పట్టణంలో డీఎస్పీ కంజాక్షన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలతో పాటు ప్రధాన కూడళ్లలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

పెనుకొండ: టీడీపీ రాష్ట్ర బంద్ ప్రభావం నియోజకవర్గంలో ఎక్కడా కనిపించలేదు. సోమవారం ఉదయం టీడీపీ నాయకులు కాస్త హడావుడి చేశారు. వ్యాపార సముదాయాలు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు యథావిధిగానే తిరిగాయి. టీడీపీ నాయకులు అక్కడక్కడా ధర్నాలకు దిగడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ హుస్సేన్‌పీరా ఆధ్వర్యంలో సీఐ కరుణాకర్, ఎస్‌ఐ విజయ కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. సోమందేపల్లి, రొద్దం, గోరంట్ల, పరిగి మండలాల్లోనూ బంద్ ప్రభావం కనిపించలేదు.



చిలమత్తూరు: కొడికొండ చెక్‌పోస్ట్‌లో తిరుగుతున్న ఆర్టీసీ బస్సు



అగళి: సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌ఐ లావణ్య



పెనుకొండ: శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

నూతన కమిటీ ఎంపిక



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా

హిందూపురం టౌన్: మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా నిలుస్తుందని హిందూపురం మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా అన్నారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బాబాఫకృద్దీన్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు నాయకత్వంలో మున్సిపాలిటీలో యూనియన్ హెచ్ 234 నూతన కమిటీ సోమవారం ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఆసీఫ్ వుల్లా, అధ్యక్షుడిగా రఘు, ఉపాధ్యక్షుడిగా కిష్ట, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, సహాయ కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారి కగ్గలప్ప, సహాయ కోశాధికారిగా శీన, కోఆర్డినేటర్‌గా నరేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగరాజు, వర్కింగ్ జాయింట్ ప్రెసిడెంట్‌గా నిజాంవలి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోలీస్ యాక్ట్ అమలు

పెనుకొండ: మండలంలో పోలీస్ యాక్ట్ 30 అమలు చేస్తున్నట్లు ఎస్‌ఐ. రమేష్‌బాబు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించేలా ధర్నాలు, నిరసనలు చేస్తూ ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం



తీవ్రంగా గాయపడిన బోయ కావలప్ప

అగళి: ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో బోయ కావలప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మండల పరిధిలోని నందరాజనపల్లికు చెందిన బోయ కావలప్ప పని నిమిత్తం సోమవారం ద్విచక్ర వాహనంలో శిర పట్టణానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. మార్గమధ్యలోని వడగుంటనహళ్లి క్రాస్ మలుపు వద్దకు రాగానే రోడ్డు పక్కనే ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో బోయ కావలప్ప తలకు బలమైన గాయాలు కావడంతో అపస్మారకస్థితిలోని వెళ్లారు. క్షతగాత్రుడిని తుమకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అగళి ఎస్‌ఐ లావణ్య ఘటన స్థలాన్ని పరిశీలించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మడకశిర: పట్టణ సమీపంలోని పెనుకొండ రోడ్డులో సోమవారం ప్రమాదం తప్పింది. సిమెంట్ లోడుతో పెనుకొండ వైపు నుంచి వస్తున్న ఓ లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొంది. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. లారీ మాత్రం పాక్షికంగా దెబ్బతింది.

డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ



పనులు ప్రారంభిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక

హిందూపురం: పట్టణంలో అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతూ సౌకర్యాలు కల్పిస్తామని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక అన్నారు. 33వ వార్డు కౌన్సిలర్ చిన్నమ్మ ఆధ్వర్యంలో అహ్మద్‌నగర్‌లో రూ.10.05 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణానికి సమన్వయకర్త దీపిక భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు షాజియా, ఆసీఫ్,నాయకులు సాదిక్, ముస్తఫా, డిష్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

రిటైర్డ్ జడ్జి శివశంకర్‌కు పీహెచ్‌డీ



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న రిటైర్డ్ జడ్జి శివశంకర్

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లికి చెందిన రిటైర్డ్ జడ్జి శివశంకర్ ఆంధ్రా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఇందులో భాగంగా విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. చదువుపై ఉన్న ఆసక్తితోనే రిటైర్డ్ అయిన తర్వాత కూడా పీహెచ్‌డీని పూర్తిచేసినట్లు జడ్జి శివశంకర్ తెలిపారు.

ఘనంగా ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదినం



హిందూపురంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి తదితరులు

హిందూపురం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదినాన్ని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బీపీఎల్ షోరూం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగ కార్యదర్శి లోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఇలియాజ్, నాయకులు సుభాష్‌గాంధీ , సోమశేఖర్, చాంద్, రాజారెడ్డి, చిరంజీవి, శివ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకను మండలంలోనూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మండలంలోని సమర్థనం దివ్యాంగుల ట్రస్ట్‌లో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి పాల్గొన్నారు. అనంతరం దివ్యాంగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, సదాశివరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హనుమంతరెడ్డి, దివాకర్‌రెడ్డి, రంగారెడ్డి, రవీంద్రరెడ్డి, బాబేనాయక్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

హిందూపురం అర్బన్: సేవా మందిర్ సమీపంలోని మోతుకపల్లి పెట్రోల్ బంక్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. హిందూపురం నుంచి పరిగి వైపు వెళ్తున్న ఆటోని వెనుక నుంచి టెంపోను ఢీ కొంది. ప్రమాదంలో పట్టణంలోని ఆటోనగర్‌కు చెందిన ఆకాష్, గౌతమ్, రాము గాయపడగా హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రామును మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

లేపాక్షి: తైక్వాండో జాతీయస్థాయి పోటీల్లో లేపాక్షిలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న పి.అనీల్‌శ్రీనివాస్ ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. జిల్లాస్థాయిలో బంగారు పతకం, రాష్ట్రస్థాయిలో రెండోస్థానం, జాతీయస్థాయి పోటీల్లో రాణించి కళాశాలకు పేరుతెచ్చారని కొనియాడారు.

తప్పుచేశాడు.. శిక్ష అనుభవిస్తున్నాడు

చిలమత్తూరు: టీడీపీ అధినేత చంద్రబాబు తప్పు చేశాడు కాబట్టే శిక్ష అనుభవిస్తున్నాడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అరెస్ట్ అయిన బాబు కోసం సొంత పార్టీ నేతలే రోడ్లపైకి వచ్చి సంఘీభావం తెలపని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. బాబు చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయని, ఆయన పాపం పండిందన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

గుడిబండ: మండల పరిధిలోని మోరుబాగల్ పంచాయతీలో నూతనంగా మంజూరైన 29 పింఛన్లను సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజు, పంచాయతీ కార్యదర్శి రమేష్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి

గుడిబండ: మండలంలో నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ రవిచంద్రకుమార్ హెచ్‌ఎమ్‌లకు సూచించారు. సోమవారం నాడు-నేడుకు ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎమ్‌లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పలు సూచనలు, సలహాలిచ్చారు.